ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల,ఫిబ్రవరి14 : పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అందించే సాయాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మల్దకల్ మండల కేంద్రానికి చెందిన రమేశ్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్షా50వేల ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మన్న, నాయకులు వెంకటన్న, తిమ్మప్ప, ప్రభాకర్, పరశురాముడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గట్టు, ఫిబ్రవరి 14 : ఇందువాసి మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ విజయ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, నాయకులు రామకృష్ణారెడ్డి, బజారి ఉన్నారు.

అక్షర జ్ఞానం అజ్ఞానాన్ని తొలగిస్తుంది

● ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బేబిరాణి

పెద్దమందడి, ఫిబ్రవరి 14 : అక్షర జ్ఞానం అజ్ఞానాన్ని తొలగించి జీవితానికి వెలుగునిస్తుందని మోజర్ల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బేబి రాణి అన్నారు. బుధవారం కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామంలో మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని పలువీధుల గుండా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బాల్య వివాహాలు, చదువుపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టేందుకు మేధావులు, విద్యావంతులు ముందుకురావాలన్నారు. బాల్య వివాహాలు చేయడంతో మహిళ తన జీవితంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటుందన్నారు. బాల బాలికలకు ప్రతి ఒక్కరికీ విద్య కల్పించడం నైతిక హక్కుగా భావించి తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలన్నారు. బడిబయటి పిల్లలను బడికి పంపించాలని సూచించారు.

ప్రభోత్సవంపై ఊరేగిన శ్రీవారు

అయిజ, ఫిబ్రవరి 14: ఉత్తనూర్‌లో కొలువుదీరిన ధన్వంతరి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ప్రభోత్సవంపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. భాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల గోవిందనామస్మరణ మధ్య పురవీధుల్లో ఊరేగారు. బుధవారం రాత్రి 12 గంటలకు రథోత్సవం నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం వసంత పంచమిని పురస్కరించుకొని శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే మండలంలోని టీటీదొడ్డిలో వెలిసిన గుండ్ల భీమరాయుడి ప్రభోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. బుధవారం రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉత్తనూర్‌లో శ్రీవారం ప్రభోత్సవం

కల్యాణం.. కమనీయం



మొక్కులు చెల్లించుకుంటున్న జెడ్పీవైస్ చైర్మన్, గ్రామస్తులు

కొత్తకోట, ఫిబ్రవరి14 : మండలంలోని అమడబాకుల గ్రామంలో వెలిసిన స్వయంభూ కల్యాణలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు కమనీయంగా నిర్వహించారు. ఉదయం 9గంటల కు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. 11.55 గంటలకు మాఘశుద్ధ పంచమిన కల్యాణం, సాయంత్రం బలిహరణ, డోలారోహణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, కృష్ణయ్య, సుందర్‌రెడ్డి, రాము, బుచ్చన్న, సురేంద్రచారి, శశిరెడ్డి ఉన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

గుంతరామలింగేశ్వరాలయంలో భక్తుల సందడి

అయిజ, ఫిబ్రవరి 14: పట్టణంలోని భ్రమరాంబిక, గుంతరామలింగేశ్వరాలయం శివనామస్మరణలతో మార్మోగింది. బుధవారం ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, భాజాభజంత్రీలు, మేళతాళాలు, భక్తుల శివ నామస్మరణ నడుమ ఆలయంలో గణపతి, భ్రమరాంబిక, నంది, సత్యనారాయణస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయుడు, నవగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన ఆడబిడ్డలకు కొత్త దుస్తుల్లో ఒడిబియ్యం పెట్టి సాగనంపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు సన్మానం

కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

గోపాల్‌పేట, ఫిబ్రవరి 14 : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రేవల్లి మండలంలోని నాగపూర్ వివేకానంద విద్యానికేతన్ చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. 20మంది విద్యార్థులు పాల్గొనగా ఇందులో 12మంది బంగారు, ఇద్దరు వెండి, నలుగురు క్యాంస పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ రాగిణి సురేందర్ తెలిపారు. బుధవారం వీరిని ఉపాధ్యాయులు పర్వతాలు, రాజు, సింధు, లత, సరిత అభినందించారు.

సమతావాధికి ఘన నివాళి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14 : సమతావాధి మహోన్నత వ్యక్తి దామోదర సంజీవయ్య జయంతి వేడుకలను ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్, డాక్టర్ నర్సంహాశర్మ, బాలస్వామి, దేవన్ననాయుడు, బాలేమియా, పరమేశ్వరాచారి, సత్యంచారి ఉన్నారు.

విధినిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించాలి

● జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, ఫిబ్రవరి14 : పోలీసులు విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. జిల్లా నుంచి పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారికి సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామకాలు అందజేస్తున్న సందర్భంగా నియామక పత్రాలు తీసుకోవడానికి ఎంపికైన అభ్యర్థులు జిల్లా నుంచి ఐదు బస్సుల్లో బయలు దేరగా కలెక్టర్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.బుధవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలు దేరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి పోలీస్‌శాఖ పరిధిలో 188మంది పురుషులు, 34మంది మహిళలు మొత్తం 222మంది కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారన్నారు. వీరందరికీ ఎల్‌బీ స్టేడియంలో సీఎం నియామక పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, ఏఆర్ డీఎస్పీ నరేందర్‌రావు, అధికారులు రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన ట్రైనీ కానిస్టేబుళ్లు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14 : ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ నియామక ఉత్తర్వులు అందుకునేందుకు బుధవారం హైదరాబాద్‌కు ట్రైనీ కానిస్టేబుళ్లు తరలివెళ్లారు. బుధవారం జిల్లా పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్, జిల్లా పరిపాలన అధికారి భానుప్రకాశ్‌లు ట్రైనీ కానిస్టేబుల్ అభ్యర్థులను అభినందించారు. కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులు నియామక ఉత్తర్వులు అందుకునేందుకు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లేందుకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్ మాట్లాడుతూ చట్టాన్ని పరిరక్షించే అధికారులుగా పోలీస్ శాఖలో అడుగిడుతున్నారని, నేటి నుంచి మంచి క్రమశిక్షణతో కూడిన జీవితం అలవడుతుందని, జిల్లాకు 183 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, అందులో సివిల్, ఏఆర్ స్పెషల్ పోలీస్, ఎక్సైజ్, జైలు వార్డెన్, పోలీస్ ఐటీ కమ్యునికేషన్‌కు చెందిన వారు ఉన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, లైజెనింగ్ అధికారులు ఉన్నారు.

జెండాఊపి బస్సులను ప్రారంభిస్తున్న జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

వైభవంగా జోగుళాంబ బ్రహ్మోత్సవాలు

● 1108 కలశాలతో అమ్మవారికి అభిషేకం
● భక్తులకు అమ్మవారి దర్శనం
● ఘనంగా కల్యాణోత్సవం

అలంపూర్, ఫిబ్రవరి 14: జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు 1108 కలశాలతో భక్తులు తీసుకొచ్చిన పవిత్ర జలంతో అమ్మవారి మూల విరాట్‌ను అర్చకులు అభిషేకించారు. ఈ సందర్భంగా పంచామృతాలు, వివిధ రకాల పండ్లరసాలతో అమ్మవారిని అభిషేకించారు. అభిషేకించిన నీటిని భక్తులు శిరస్సుపై చల్లుకున్నారు. మరికొంతమంది భక్తులు తీర్థంగా స్వీకరించారు. జరుగుతున్న అభిషేక కార్యక్రమం భక్తులు తిలకించేందుకు వసంత పంచమినాడే అవకాశం ఉంటుంది. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో మధ్యాహ్నం విరామం లేకుండా భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు.

అరించిన గ్రామదేవతల ప్రదర్శనలు

జోగుళాంబ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఆనంద్‌శర్మ, ఉపాధ్యక్షుడు బండారుబాబు, గౌరవాధ్యక్షుడు బండారి శ్రీనివాస్ సొంత ఖర్చుతో పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు ప్రాంతం నుంచి కళాకారులను రప్పించి, గ్రామదేవతల వేషధారణతో ఊరేగింపుగా నిర్వహించి వార్షికోత్సవాలకు వన్నె తీసుకొస్తున్నారు. కళాకారుల వేషధారణలు, విన్యాసాలు ఉత్సవాలకు మరింత ఉత్సాహాన్ని నింపాయి. కొన్నేండ్లుగా ఊరేగింపు క్షేత్రంలో ఆచారంగా కొనసాగుతున్నది. తుంగభద్రానది తీరం హరిశ్చంద్ర ఘాట్‌లో వెలిసిన ఘంటలేశ్వరాలయం నుంచి గ్రామదేవతల అలంకరణతో ఊరేగింపు మొదలై జోగుళాంబ ఆలయం చేరుకున్నారు. జోగుళాంబ సేవా సమితి ఆధ్వర్యంలో బండారి శ్రీనివాసులు, వెంకన్న బాబు కుటుంబ సభ్యులు అమ్మవారికి చీరె, సారె, పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రతి ఉత్సవాలకు జోగుళాంబ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది.

అన్నదానాలు

ఆలయ ప్రాంగణంలో జోగుళాంబ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మరోవైపు పుష్కరఘాట్ వద్ద పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

రెండు క్యూలైన్లలో దర్శనం

ఆలయ పాలక మండలి సభ్యులు, చైర్మన్ చిన్నకృష్ణయ్య నాయుడు, ఈవో పురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో రెండు వరుసల క్యూలైన్ ఏర్పాటుతో భక్తులకు కొంత ఊరట కలిగింది. గతంలో సర్వదర్శనం శీఘ్రదర్శనం

కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు

కలశాలతో ఊరేగింపుగా మహిళా భక్తులు

రెండు కలిపి ఉండడంతో భక్తులు ఒకానోక సందర్భంలో ఇబ్బంది పడుతూ తోపులాటకు గురయ్యేవారు. ఆలయంలో ఓ భక్తుడి సాయంతో ఏర్పాటు చేసిన కొత్త క్యూలైన్లతో సర్వ దర్శనం, అంతరాలయ దర్శనం లైన్‌లు వేర్వేరుగా ఉండడంతో భక్తులు ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకున్నారు.

కలశాలతో ఊరేగింపు

గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతిఇంటి నుంచి ఓ కలశంతో భక్తులు బయలుదేరి ఆలయం వరకు ఊరేగింపుగా చేరుకున్నారు. గ్రామంలో ఎటుచూసినా కలశాలతోనే భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

పూర్ణాహుతి

ఆలయానికి ఈశాన్య భాగంలో నిర్మించిన యాగశాల మండపంలో ఆవాహిత దేవతా హోమాలకు ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు పూర్ణాహుతిని సమర్పించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన సుగంధ ద్రవ్యాలు, పట్టుచీర, నవరత్నాలు, గంధపు చెక్కను పూర్ణాహుతిలో సమర్పించారు.

గద్వాలలో కుక్కల స్వైర విహారం

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రమైన గద్వాలలో కొంత కాలంగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చాలా చోట్ల కుక్కలు చిన్నారులు, మహిళలపై దాడులు చేస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా బుధవారం గద్వాల పట్టణంలోని 30వ వార్డులోని సుంకులమ్మమెట్టు కాలనీలో పద్మ, వెంకటేశ్‌ల కుమారుడైన కిరణ్‌తేజ్ అనే 8వ తరగతి విద్యార్థిపై ఐదు కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయగా ఆ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. కుక్కల దాడి ఘటనపై మున్సిపల్ చైర్మన్ కేశవ్‌కు కాలనీవాసులు ఫిర్యాదు చేయగా త్వరలోనే కుక్కలు పట్టే బృందాన్ని పిలిపించి కుక్కల బెడద లేకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ముగిసిన టీఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీ

అయిజ, ఫిబ్రవరి 14: పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన టీఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీ బుధవారం ముగిసింది. 13రోజులుగా నిర్వహిస్తున్న టోర్నీలో 8 జట్లు పాల్గొన్నాయి. టోర్నీలో మొదటి విజేతగా అజయ్ లెవల్ గెలుపొందగా, రెండో విజేతగా యూనిక్ స్పోర్ట్స్ గెలుపొందింది. విజేతలకు శాంతినగర్ సీఐ ప్రదీప్‌కుమార్, బహుమతి దాత సోమశేఖర్‌రెడ్డి నగదు, ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్, ఆర్డీఎస్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ సీతారాంరెడ్డి, కౌన్సిలర్లు షేక్షావలి ఆచారి, రాణెమ్మ, మధుకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

పాన్‌గల్,ఫిబ్రవరి 14: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని జాతీయ అష్యూరెన్స్ సభ్యులు డాక్టర్ బలవంత్ మక్వాన, డాక్టర్ అమిగియాస్ వసంత్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో బుధవారం పలువీధుల్లో పర్యటించి ప్రజలకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

అయిజ టీ స్టాళ్లల్లో చోరీ

అయిజ, ఫిబ్రవరి 14: పట్టణంలోని కర్నూల్ రోడ్డులో టీ స్టాళ్లల్లో దుండగులు చోరీలకు పాల్పడ్డారు. టీ స్టాళ్ల యజమానులు, స్థానికుల కథనం మేరకు.. అయిజ పట్టణంలోని కర్నూల్ రోడ్డులోని పలు టీ స్టాళ్లల్లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు టీ స్టాళ్లకు ఉండే రేకులను కట్టర్లతో కత్తిరించి చొరబడి, వస్తువులు, సిగరెట్లు చోరీ చేశారు. గతంలో పలు చోరీలు జరగడంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎస్సై నరేశ్ దృష్టికి తీసుకెళ్లగా యజమానులు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం

గోపాల్‌పేట, ఫిబ్రవరి 14 : పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లను స్మరించుకుంటూ ఏడుల మండలకేంద్రంలో బుధవారం ఏడుల యువక బృందం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈశిబిరంలో 30మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదాతలకు తాసీల్దార్ రామకృష్ణ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నరేందర్, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, సింగిల్ విండో డైరక్టర్ గోపాల్‌యాదవ్, గ్రామస్తులు జయప్రకాశ్, కురుమూర్తి, కృపాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

యువశక్తి ఆధ్వర్యంలో రక్తదానం

వనపర్తి, ఫిబ్రవరి 14 : పట్టణంలోని యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో మృతి చెందిన సీఆర్పీఎఫ్ జవాన్లు స్ఫూర్తిగా రెడ్‌క్రాస్ కేంద్రంలో యువకులు రక్తదానం చేశారు. రక్తదానంలో చేసిన వారిలో ఫౌండేషన్ అధ్యక్షుడు నవీన్, మధు, సాయితేజ్, శ్రీకాంత్, కురుమూర్తి, చందు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

వనపర్తి, ఫిబ్రవరి 14 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పలుపురు అధికారుల బదిలీ ప్రక్రియ జిల్లాలో కొన సాగుతున్నది. అందులో భాగంగా వనపర్తి మున్సిపాలిటీ కమిషనర్ విక్రమసింహారెడ్డి తాండూరు మున్సిపాలిటీకి బదిలీ అయినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

గద్వాల పుర కమిషనర్ బదిలీ!

గద్వాలటౌన్, ఫిబ్రవరి14 : గద్వాల మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సింహ వరంగల్ జిల్లా పరకాల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉన్నత శాఖ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీగా విధులు నిర్వహిస్తున్న శంకర్‌సింగ్‌ను నియమిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. అయితే బాధ్యతలు ఎప్పుడు చేపట్టాలన్నది ఉత్తర్వులో పేర్కొనలేదు. దీంతో కొంత సందిగ్ధత నెలకొంది. కాగా శంకర్‌సింగ్ స్థానంలో మరొకరిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు పావులు కదుపుతున్నట్లు కార్యాలయంలో చర్చనీయంగా మారింది.

అయిజ మున్సిపల్ కమిషనర్ బదిలీ

అయిజ, ఫిబ్రవరి 14: అయిజ మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ బదిలీ అయ్యారు. అయిజ మున్సిపల్ కమిషనర్‌గా సత్యబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేడో.. రేపో విధుల్లో చేరే అవకాశం ఉంది.

మానవ అక్రమ రవాణాపై కళాజాత

కొత్తకోట, ఫిబ్రవరి 14 : మానవ అక్రమ రవాణా చేయడం నేరమని అందుకు ఎవరైనా ఉపక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటారని బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్‌లో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులను బానిసలుగా చేసి పనిలో పెట్టుకోవడం అవయవాల కోసం కొందరిని మోసగించడం, అప్పు తీర్చలేక నిర్బంధించడం వంటివి చట్ట ఉల్లంఘన కిందకి వస్తుందని బృందం సభ్యులు వివరించారు.

పీఎం కిసాన్ పథకంపై అవగాహన

ఉండవెల్లి, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని రైతు వేదికలో పీఎం కిసాన్ పథకంపై మానవపాడు, అలంపూర్, ఉండవెల్లి మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో ఏడీఏ సక్రియానాయక్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్ మాట్లాడుతూ.. పీఎం కిసాన్ పథకం ద్వారా ఇప్పటి వరకు రైతులకు 15వాయిదాల డబ్బులను బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. 16వ వాయిదా డబ్బులు జమ కావాలంటే విధిగా రైతులు ఈకేవైసీ చేయించాలన్నారు. రైతుల ఈకేవైసీని విధిగా క్లస్టర్ ఏఈవోలు చేయించాలని జిల్లా అధికారి ఆదేశించారు. కార్యక్రమంలో ఏవోలు సురేఖ, సుబ్బారెడ్డి, అనిత, మానవపాడు, అలంపూర్, ఉండవెల్లి ఏఈవోలు పాల్గొన్నారు.

రైతులపై దాడులను ఖండించాలి

అమరచింత, ఫిబ్రవరి 14: రైతుల హక్కులను హరించే నల్లచట్టాలను రద్దు చేయాలని ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం చేసిన దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ గోపి, తెలంగాణ రైతు సంఘం నాయకులు అజయ్ కోరారు. రైతులపై దాడులను నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న బీజేపీ ప్రభుత్వం దేశానికి అన్నం పెట్టె రైతులకు న్యాయం చేయడంలో పూర్తిగా విఫలమైందని, రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజోళి ఎంపీడీవోగా రమేశ్‌కుమార్

రాజోళి, ఫిబ్రవరి 14: రాజోళి ఎంపీడీవోగా రమేశ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఊట్కూర్ ఎంపీడీవో విధులు నిర్వహిస్తూ బదిలీపై రాజోళికి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న గోవిందురావు నారాయణపేట జిల్లా మక్తల్ మండలానికి ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు.

ఎంపీడీవోగా అజహర్ మొహియుద్దీన్

ఇటిక్యాల, ఫిబ్రవరి 14: ఇటిక్యాల మండలంలో పని చేస్తున్న ఎంపీడీవో రాఘవ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కేటీదొడ్డి ఎంపీడీవోగా ప నిచేస్తున్న అజర్‌మొహినొద్దీన్ బదిలీపై వచ్చారు. గురువారం బాధ్యతలు చేపట్టనున్నట్లు ఎంపీవో భాస్కర్ తెలిపారు.

కేటీదొడ్డి ఎంపీడీవోగా రాములునాయక్

కేటీదొడ్డి, ఫిబ్రవరి 14 : కేటీదొడ్డి ఎంపీడీవోగా రాములు నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఎంపీడీవోగా పనిచేసిన మహ్మద్ అజహర్ మొహియుద్దీన్ ఇటిక్యాలకు బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్లిన ఎంపీడీవోను సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీవో అబ్దుల్ సయ్యద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ ఎంపీడీవోగా వెంకటయ్య

అయిజ, ఫిబ్రవరి 14: అయిజ ఎంపీడీవోగా వెంకటయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట జిల్లా నుంచి జోగుళాంబ గద్వాల జిల్లాకు బదిలీపై వచ్చిన వెంకటయ్యను అయిజ ఎంపీడీవోగా నియమిస్తూ కలెక్టర్ సంతోష్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

అయిజ రూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని సంకాపురం పాఠశాలలో బుధవారం వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానసరస్వతి అమ్మవారి విగ్రహానికి హెచ్ఎం కృష్ణ ఆధ్వర్యంలో వేదపండితులు నదీ జలాలతో అభిషేకం చేశారు. అర్చన, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆశీస్సులతో విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించి పాఠశాల, గ్రామం, తల్లిదండ్రులకు మంచిపేరును తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అక్షరాభాస్యం

ఉండవెల్లి, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో వస సప్తమి వేడుకలను ఆలయ నిర్వాహులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ అమ్మవారి ఆలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో అక్షరాభాస్యం చేయించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠ

రాజోళి, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్‌లో వసంత పంచమిని పురస్కరించుకొని సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని రెండురోజులు నదిలో ఉంచి బుధవారం పాఠశాల ఆవరణలో క్షీరాభిషేకాలు నిర్వహిస్తూ ప్రతిష్ఠించారు. మాన వపాడుకు చెందిన ఏలూరు సంజమ్మ, కిష్టారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు ముందుకొచ్చి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు సహకారించారు. ఎంపీయూపీఎస్‌లో గతంలో చదవుకున్న విద్యార్థుల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేసినట్లు హెచ్ఎం సురేశ్ తెలిపారు. వసంత పంచమి సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠతో చిన్నారులతో తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. దాతలకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గజేంద్రరెడ్డి, తిప్పన్న, జీహెచ్ఎం నిర్మలాజ్యోతి, మాదన్న, భీముడు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు నిషాక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14 : వనపర్తి జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్, వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి ఆలయాల్లో వసంత పంచమిని పురస్కరించు